# తెగింపు

దుర్గాగోపి



మావారి పేరు వినయ్. పేరుకు తగ్గట్టుగానే వినయంగా ఉంటారు. అయితే ఆయనకో చిన్న దురలవాటు ఉంది సుమండీ! అప్పుడప్పుడూ పార్టీలకు, ఫంక్షన్‌లకు వెళ్తూ లైట్‌గా ఫ్రెండ్స్‌తో తాగి వస్తారు. అంతకు మించి ఆయనలో ఎంచటానికి ఇంకేమీ వుండదు. అయితే అది కాస్త తీవ్ర రూపం దాల్చి రోజూ త్రాగడం ప్రారంభించారు. మొదట్లో అంతగా పట్టించుకోలేదు గాని, రాను రానూ అతని ఆరోగ్యం దెబ్బ తినడంతో— 'శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించినట్లు' ఆ త్రాగుడు అలవాటు మానమని నచ్చజెప్పి చూసాను. అయితే ప్రయోజనం మాత్రం శూన్యం. ఇక చూసి చూసి భరించలేక ఆయనతో ఒకసారి ఇలా చెప్పాను, "ఏమండీ! మీరు గాని త్రాగుడు మానకపోతే నేను మా పుట్టింటికి వెళ్ళి సెటిల్ అయిపోతాను" అని చెప్పాను. మరి ఏమనుకున్నారో గాని త్రాగుడుకు పూర్తిగా స్వస్తి చెప్పి రోజూ ఆఫీసు అవగానే తిన్నగా ఇంటికి వచ్చేవారు.

"ఏమండీ! ఎలాగైతేనేం త్రాగుడు మానేసారుగా. నా సంతోషం కొద్దీ మీకేదైనా ఇవ్వాలనుకుంటున్నా. ఏం కావాలండీ?" ఆయన్ని ఆశగా అడిగాను.

"ఓ 'పెగ్' కావాలోయ్" జోక్ వేసారు మావారు. మావారి కొలీగ్‌కి ప్రమోషన్ వచ్చినందుకు సతీసమేతంగా పార్టీకి రమ్మని ఆహ్వానించాడు. అందువలన ఆయనతో పాటు నేను కూడా పార్టీకి వెళ్ళాను. ఇంతలో మా ఫ్రెండ్ హారితతో మాట్లాడుతుండగా, ఆయన నెమ్మదిగా నా నుండి జారుకున్నారు. ఒక అయిదు నిమిషాల తర్వాత ఒక పెగ్ వేసుకొని ఏమీ తెలియనట్టు తిరిగొచ్చారు. అది మొదలు మళ్ళీ ఆ త్రాగుడు రోగం మహమ్మారిలా ప్రారంభమయింది. ఇంతకు ముందులా బెదిరింపులకు లొంగడం మానేసారు. ఆ టాపిక్ ఎత్తితే విపరీతంగా కొప్పడేవారు. ఇక లాభం లేదనుకొని తాడో పేడో తేల్చుకుందామని, "గురివింద గింజలోని" మచ్చలా, మీకు ఆ త్రాగుడు మాయని మచ్చగా తయారవక ముందే ఆ అలవాటును మానుకోండి. లేకపోతే నే 'సూసైడ్' చేసుకోవడం వంటి తీవ్ర పరిస్థితులను ఎదుర్కోవలసి వస్తుంది. ఇప్పటికే నలుగురూ చెప్పుకుంటున్నారు. సగం పరువు అప్పుడే పోయింది. ఆ కాస్త మిగిలింది కూడా బజారుకెక్కకుండా చూడండి" అంటూ సీరియస్‌గా ఆయనికి చెప్పాను.

"నాకు మాత్రం నలుగురి నోటిలో పడడం సరదా అనుకున్నావా? నేను కూడా శ్రీరామచంద్రుడిలా బ్రతకాలనుకుంటున్నాను. ఈ అలవాటు మానడానికి ఎంత ప్రయత్నిస్తున్నానో తెలుసా! సరదాగా అలవాటు అయిన ఇది వ్యసనంగా మారుతుందని నేను మాత్రం ఊహించాననుకున్నావా?" అని బాధగా చెప్తున్న ఆయన్ని చూస్తే జాలి వేసింది: అయినా ఆయన్నని ప్రయోజనమేంటి? ఇటువంటి మత్తు పానీయాలను నిషేధించమని ఏ నాయకుడైనా, ఏనాడైనా అంటే గదా! దీని వలన ఎన్ని కుటుంబాలు బజారున పడడం ప్రాబ్లమ్ గురించి పూస గుచ్చినట్లుగా వివరించాను. త్రాగుడు వలన వచ్చే అనర్థాలను గురించి, దాని వలన వచ్చే జబ్బుల గురించి వివరిస్తూ, మనిషి యొక్క ఆయుస్సును ఎంతగా తగ్గిస్తుందో మొదలగు వాటి గురించి ఒక అరగంట లెక్చరిచ్చారు సైకియాట్రిస్ట్. అక్కడ నుండి బయటకొస్తూ "నాకు చిన్న పనుంది. చూసుకొస్తాను. నీవు ఆటోలో ఇంటికి వెళ్ళు" చెప్పారు మావారు. "ఎక్కడికి వెళ్తారండి?" అడిగాను. విపరీతమైన తలనొప్పిగా వుంది. ఆ సైకియాట్రిస్ట్ బుర్ర తినేసాడనుకో! అందుకే అలా 'బార్' కెళ్ళొస్తానని చెప్తూ, చకచకా వెళ్తున్న ఆయన్ని చూస్తే కడుపులో అగ్నిపర్వతం బ్రద్దలయినట్లయింది. అంతలో అటు వైపే తోకూపుకుంటూ వెళ్తున్న కుక్కను చూసి ఏదో గుర్తొచ్చి విషాదంతో కూడిన నవ్వు వచ్చింది. చివరకో నిర్ణయానికొచ్చి ప్రముఖ లాయర్ రంగనాథం ఇంటివైపు దారితీసాను నా నిర్ణయం మంచిదే అని మనసులో అనుకుంటూ.

మినీకథ

— దుర్గాగోపి.